ప్రజాశక్తి
బుధవారం 25 జూన్ 2025
5
అనంతపురం

ఎస్‌డబ్ల్యూపిసి షెడ్లను

వినియోగంలోకి తెండి : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్

జిల్లాలో చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలు(ఎస్‌డబ్ల్యూపిసి షెడ్ల) నిర్వహణ పకడ్బందీగా చేపట్టి అన్నింటినీ వినియోగంలోకి తేవాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం అనంతపురం నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి పంచాయతీ సెక్టార్, తదితర అంశాలపై సంబంధిత శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఆయా శాఖల మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 526 ఎస్‌డబ్ల్యూపిసి షెడ్లు ఉండగా అందులో 522 షెడ్లు పని చేస్తుండగా, మిగిలిన 4 షెడ్లు పని చేయడం లేదన్నారు. వాటిని కూడా పూర్తిగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్‌డబ్ల్యూపిసి షెడ్లు లేని గ్రామ పంచాయతీల్లో వాటిని ఏర్పాటు చేయాలన్నారు. గ్రీన్ అంబాసిడర్లకు, గ్రీన్‌గార్డ్స్ కి పేమెంట్ పూర్తిగా చెల్లించాలన్నారు. మొత్తం ఎస్‌డబ్ల్యూపిసి షెడ్లలో ఇంకా 72 చోట్ల విద్యుత్, 10 చోట్ల నీరు, 8 చోట్ల రోడ్డు సదుపాయం కల్పించాల్సి ఉందన్నారు. వీలైనంత త్వరగా ఈ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. తల్లికి వందనం ఈకేవైసీకి సంబంధించి మదర్ ఈకేవైసీ పెండింగ్, తల్లి తొలగింపు, పిల్లల తొలగింపు ప్రక్రియలను పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగుల బయోమెట్రిక్ అటెండెన్స్‌కు సంబంధించి 100 శాతం అటెండెన్స్ నమోదయ్యేలా పురోగతి తీసుకురావాలన్నారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

లొసుగును పట్టేసి.. కోట్లు నొక్కేసి..!



అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం కేంద్రంగా వెలుగు చూసిన నకిలీ ఈ-స్టాంపులు, ఈ-చలనాల వ్యవహారం అటు రాజకీయ, ఇటు అధికార వర్గాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇందులో కోట్లాది రూపాయాలు స్కాం జరిగినట్లు బహిర్గతం కావడం ఇప్పుడు పెద్ద చర్చనీయాంశం అయ్యింది. ఇ-స్టాంపు విధానంలో ఉన్న ఒక లొసుగును పట్టేసి కోట్ల రూపాయలు ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టినట్లు తెలుస్తోంది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి
కళ్యాణదుర్గం టౌన్

ఇ-స్టాంపు తీసాక స్టాంపు డ్యూటీ చెల్లించాల్సి ఉంటుంది. స్టాంపులో కనబరచిన విలువలో 0.5 శాతం స్టాంపు డ్యూటీగా ప్రభుత్వానికి చెల్లించాలి. అది ఇ-స్టాంపు తీసుకున్న తరువాత వెండర్ ద్వారా ప్రభుత్వానికి జమవుతుంది. వెండర్‌కు ఇ స్టాంపు తీసుకున్న వ్యక్తి చెల్లించాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ సమయాల్లో అయితే కట్టిన స్టాంపు డ్యూటీ విలువ ప్రకారం ఉందా లేదా అన్నది రిజిస్ట్రేషన్ అధికారులు పరిశీలిస్తారు. నిబంధనల ప్రకారం చెల్లింపు జరగకపోతే తదుపరి ప్రక్రియలో ముందుకు వెళ్లదు. ఒక్క రూపాయి తక్కువ ఉన్నా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయడం సాధ్యపడదు. అయితే కొలెట్రాల్ అగ్రిమెంట్, ష్యూరిటీ విషయాల్లో వచ్చే సరికి క్రాస్ చెక్‌కు అవకాశం లేకుండా ఉంది. ఏదైనా సంస్థ రుణం పొందే సమయంలో రుణదాతలకు వారి మధ్య అగ్రిమెంట్లు జరుగుతాయి. కొలెట్రాల్ అగ్రిమెంటు జరిగే సమయంలోనూ రుణ విలువపై 0.5 శాతం స్టాంపు డ్యూటీ చెల్లించాల్సి ఉంటుంది. కాని దీనికి రిజిస్ట్రేషన్ శాఖ ధ్రువీకరణ ఏదీ అవసరముండదు. అంతా ఇ-స్టాంపు జారీ చేస్తున్న స్టాక్ హోల్డింగ్ ప్రయివేటు లిమిటెడ్ సంస్థ ఇచ్చే ఇ-స్టాంపుతోనే సరిపోతుంది. ఇక్కడ జారీ అయిన ఇ-స్టాంపును నేరుగా కొలెట్రాల్ చేయబడిన ఫైనాన్స్ సంస్థకుగాని, బ్యాంకుగాని రుణ గ్రహిత సంస్థలు అందజేస్తాయి. ఆ సంస్థ దీన్ని ఆన్‌లైన్ నేరుగా ధ్రువీకరించుకునే వెసులుబాటుంది. దీన్ని అవకాశంగా తీసుకుని ఎస్ఆర్ ఇన్‌ఫ్రా స్టాంపు డ్యూటీని నామమాత్రంగా చెల్లించి పనికానిచ్చేశారు. ఎస్ఆర్ ఇన్‌ఫ్రాకు సంబంధించిన విషయంలో ఇ-స్టాంపు జారీ చేసిన వెండర్ స్టాంపు డ్యూటీని తక్కువగా చెల్లించి, ప్రింట్ తీసిన ఇ-స్టాంపులో విలువను మార్ఫింగ్ చేశారు. దీన్ని ఎస్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థ యునైటెడ్ బ్యాంకుతో రూ.700 కోట్లకు అగ్రిమెంట్ చేసుకుంది. వాస్తవానికి రూ.700 కోట్లకు రూ.3.50 కోట్ల వరకు స్టాంపు డ్యూటీని చెల్లించాల్సి ఉంది. కాని వంద రూపాయలు చెల్లించి తరువాత మార్ఫింగ్ చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ రకంగా పెద్ద సంఖ్యలో మార్ఫింగ్ చేసినట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. కోట్లలోనే ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టినట్టయింది. దీనిపై తిరిగి ఎస్ఆర్ ఇన్‌ఫ్రానే తమకు తెలియకుండా మోసం జరిగిందని చెబుతోంది. ఈ మోసానికి పాల్పడినట్లు చెబుతున్న వెండర్ ఇప్పుడు ఎక్కడున్నాడన్నది అంతుచిక్కని వ్యవహారంగా ఉంది. పోలీసుల అదుపులో ఉన్నట్టు ప్రచారంలో ఉన్నప్పటికీ వారి నుంచి ఎటువంటి ధ్రువీకరణా జరగలేదు. ఈ క్రమంలో ఈ వ్యవహారంలో ఎస్ఆర్ ఇన్‌ఫ్రా ప్రమేయం లేదని చెప్పించే ప్రయత్నం జరుగుతోందన్న ఆరోపణలున్నాయి.

తహశీల్దార్, విఆర్‌ఒల లాగ్‌ఇన్‌లు, రబ్బరు వేలిముద్రలు.?!

మీసేవ బాబు పలువురు తహశీల్దార్, విఆర్‌ఒల లాగ్‌ఇన్‌లలోకి వెళ్లి వారు చేయాల్సిన పనులు కూడా ఇతనే వ్యవహరించేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించినట్లు ఆరోపణలున్నాయి. పలువురు అధికారులకు సంబంధించిన రబ్బరు వేలిముద్రలను కూడా ఉపయోగించి తానే వ్యవహారాలు పూర్తి చేసినట్లు ప్రచారం సాగుతోంది. ఈ విషయం తెలుసుకున్న అధికారులు తమవైపు నుంచి ఏమైన తప్పులు జరిగి ఇరుక్కుంటామా అన్న భయాందోళనలో పడ్డారు.

అంతా గప్‌చుప్..!

కోట్లాది రూపాయలు ప్రభుత్వ ఆదాయనికి గండికొట్టారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నా అధికార యంత్రాంగం మౌనంగా ఉంది. వెండర్ భార్గవి, భర్త యల్లప్ప, ఆపరేటర్ మోహన్‌బాబును అదుపులోకి తీసుకున్నట్లు ప్రచారం జరుగుతున్నా ఇంత వరకు పోలీసు అధికారులు ధ్రువీకరించలేదు. తమ వద్దలేరని చెబుతుండటం అనేక సందేహాలకు తావిస్తోంది. దీనిపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారన్న దానిపైనా రిజిస్ట్రేషన్ అధికారులు కూడా స్పందించడం లేదు. ఆరోపణలొచ్చాక కళ్యాణదుర్గం వెళ్లి పరిశీలించినట్లు రిజిస్ట్రేషన్ శాఖ డిఐజి విజయలక్ష్మి తెలిపారు. స్టాక్ హోల్డింగ్ సంస్థ నుంచి వెండర్‌గా ఉన్న వారు అందుబాటు లేకపోవడంతో వెనుదిరిగి వచ్చినట్లు తెలిపారు. అందులో ఏమి జరిగిందన్నది తమకు తెలియదని, రిజిస్ట్రేషన్ శాఖకు స్టాక్ హోల్డింగ్ సంస్థ ద్వారా జరుగుతున్న కార్యకలాపాలకు సంబంధం లేదని వివరణిచ్చారు.

రెండు రుణాలు కాదా...ఇంకా ఉన్నాయా..?

ఎస్ఆర్‌సి ప్రతినిధి మీసేవ బాబు మోసాల నిర్వహకంపై చేసిన ఫిర్యాదులో కొన్ని మాత్రమే పొందు పరిచినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రచారం జరుగుతున్న రూ.900కోట్లు, మరో రుణం రూ.20కోట్లు రుణంకు ఈ-స్టాంపులలో జరిగిన మోసాలే కాకుండా ఇంకా ఎన్నెనో ఇలాంటి మోసాలు జరిగి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. 2019 నుంచి ఎస్ఆర్‌సి అధినేతలకు పరిచయమైన మీసేవ బాబు వారి లావాదేవీలు, ఈ-స్టాంపుల వ్యవహారాలన్నింటినీ స్వయంగా చూసుకునేవాడని ఆసంస్థ ఇచ్చిన ఫిర్యాదులోనే పేర్కొన్నారు. అలాంటప్పుడు ఉమ్మడి అనంతపురం జిల్లానే కాకుండా రాష్ట్రం, పక్క రాష్ట్రాల్లో కూడా ఎన్నెనో కాంట్రాక్ట్ పనులకు మీసేవ బాబు సెంటర్‌లోనే ఈ-స్టాంపులు, చలనాలు తీసి ఉంటారనే చర్చ జోరుగా జరుగుతోంది. ఇలా జరిగి ఉంటే కోట్లాది రూపాయాలు అక్రమాలు జరిగాయనే ప్రచారం నడుస్తోంది. ఎన్ని ఈ-స్టాంపులు, ఈ-చలనాలు తీశారు... వాటిలో ఎంతెంత ప్రభుత్వానికి వెళ్లాల్సిన రుసుంలో మోసం జరిగింది..? అనే విషయాలు వెలుగు చూడాలంటే విచారణ సంస్థలు లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది.

పోలీసుల అదుపులో మరో వ్యక్తి.?

బాబు మీసేవ కేంద్రంలో కొన్నేళ్లుగా పనిచేసిన మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకున్ని మంగళవారం తెల్లవారుజామున విచారణ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. సదరు యువకుడు మాత్రం తాను అమయకుడినని, తనను అకారణంగా కేసుల్లో ఇరికించవద్దని అధికారుల వద్ద కన్నీరు పెట్టుకున్నట్లు తెలిసింది. అయితే యువకున్ని విచారణ నిమిత్తం మాత్రమే తీసుకెళ్లారా.. లేక అదుపులోకి తీసుకున్నారా అన్న విషయాలపై పోలీసులు ఎటువంటి ధ్రువీకరణా చేయలేదు.

- ◆ కొలాట్రాల్ అగ్రిమెంట్‌లో వెరిఫికేషన్ అవకాశం తక్కువ
- ◆ అదే అదునుగా ఎస్ఆర్ ఇన్‌ఫ్రా వ్యవహారంలో మోసం
- ◆ నకిలీ స్టాంప్‌ల స్కాంలో మరిన్ని అక్రమాలు అంటూ ప్రచారం

కళ్యాణదుర్గంలో మూతబడిన బాబు మీ సేవా కేంద్రం

ఎస్ఆర్‌కు సంబంధం ఉంది

తలారి రంగయ్య కళ్యాణదుర్గం వైసిపి సమన్వయకర్త.

ఎస్ఆర్‌సి అధినేతగా ఉన్న కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ప్రమేయంతోనే ఈ స్టాంప్ చెల్లింపు ఎగవేత మొత్తం జరిగిందన్న వైసిపి సమన్వయకర్త తలారి రంగయ్య తెలిపారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ ఈ వ్యవహారంపై సమగ్రమైన దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎస్ఆర్ ఇన్‌ఫ్రా తమ తప్పులేదు.. అంతా వెండర్ మీదకు తోసే ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. ప్రభుత్వం దీనిపై సమగ్రమైన విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాను మాత్రం ఈ అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిఘా సంస్థలకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలియజేశారు.

కార్పొరేట్లకు వరాలు..పేదలకు శాపాలు..!

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్పొరేట్లకు వరాలు కురిపిస్తూ.. పేదలకు శాపాలుగా మారుస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి విమర్శించారు. దారి తప్పుతున్న కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై సిపిఎం ముద్రించిన బుక్‌లెట్లను మంగళవారం కూడేరు మండల కేంద్రంలోని బస్టాండ్ సర్కిల్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ప్రజలు టిడిపి కూటమికి ఎన్నడూ లేనంత ఘన విజయం చేకూర్చారన్నారు. అయితే ప్రజల ఆశలకు తగ్గట్లుగా కూటమి ప్రభుత్వ పాలన లేదని ప్రజలు మండిపడుతున్నారన్నారు. టిడిపి, జనసేన శ్రేణులు సైతం సంతృప్తిగా లేరన్నారు. ముఖ్యంగా ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల అమలు నత్తనడకలా సాగుతోందన్నారు. వెంటనే సూపర్ సిక్స్ హామీలతోపాటు 146 రకాల హామీలను వేగంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.కరీంసాబ్, మండల నాయకులు కె.వెంకటేశులు, మల్లికార్జున, లక్ష్మీదేవి, ఆక్కులప్ప, తదితరులు పాల్గొన్నారు.

కళాశాల హాస్టల్‌లో అదనపు గదులు నిర్మించాలి

ప్రజాశక్తి-గుత్తి

ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పట్టణంలోని ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల వసతి గృహంలో అదనపు గదులు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బాలాజీ, ధను డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ బిసి బాలికల కళాశాల వసతిగృహం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ బాలికల కళాశాల హాస్టల్‌లో గదుల కొరతతో విద్యార్థినులకు ప్రవేశాలు దక్కడం లేదన్నారు. గుత్తిలో కళాశాలలకు గుంతకల్లు, ఉరవకొండ, విడపనకల్లు, ప్యాపిలి, పత్తికొండ, తదితర మండలాల నుంచి విద్యార్థినులు చదువు కోసం వస్తున్నారన్నారు. గుత్తిలో వసతి లేక బాలికలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రభుత్వ బిసి బాలికల కళాశాల వసతిగహంలో సీట్లు లేకపోవడం వల్ల తల్లిదండ్రులు వారి పిల్లలకు కళాశాలలో టీసీలు తీసుకుని వెళ్తునాన్రన్నారు. తద్వారా విద్యార్థినులు చదువులకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే చొరవ తీసుకుని దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థినికీ వసతి కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సుపరిపాలనను జీర్ణించుకోలేకే కుట్రలు

జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

విలేకరులతో మాట్లాడుతున్న జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనను చూసి జీర్ణించుకోలేక వైసిపి అధినేత జగన్ కుట్రలకు తెరతీస్తున్నారని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు, అహుడా ఛైర్మన్ టిసి వరుణ్ విమర్శించారు. మంగళవారం నగరంలోని సప్తగిరి సర్కిల్‌లో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బెట్టింగ్.. బ్లేడ్.. గంజాయి బ్యాచ్‌లను పరామర్శించేందుకు జగన్ యాత్రలు చేయడం సిగ్గుచేటన్నారు. సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తుంటే జీర్ణించుకోలేక జగన్ తన ఉనికిని కాపాడుకునేందుకు కుట్రపూరిత విధ్వంసాలకు తెరతీస్తున్నారని మండిపడ్డారు. పొదిలి ఘటన ఇందుకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, రాయలసీమ ప్రాంతీయ మహిళా కోఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మర నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యత లేని రాజకీయ ఉన్మాది జగన్

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-పుట్లూరు

మానవత్వం లేకపోతే బాధ్యతలేని రాజకీయ నాయకుడు వైసిపి అధినేత జగన్ అని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాజకీయ పార్టీ నెలకొల్పి, ప్రజా జీవితంలో ఉన్న వాళ్లు, ఉన్నత స్థానాల్లో పని చేసిన వాళ్లు మరింత బాధ్యతగా జాగ్రత్తగా ఉంటారన్నారు. అయితే దురదృష్టవశాత్తు ముఖ్యమంత్రిగా పని చేసి, ఒకపార్టీని నడుపుతున్న జగన్ తీరు దారుణంగా ఉందన్నారు. కనీస మానవత్వం లేకుండా ప్రజల ప్రాణాల కంటే రాజకీయ లబ్ధికే ప్రాధాన్యత ఇవ్వడం బాధాకరమన్నారు. పొదిలిలో వైసిపి శ్రేణుల అరాచకంతో ప్రజల భద్రత దృష్ట్యా పోలీసులు, అధికారులు పల్నాడు పర్యటనకు సంబంధించి బలపదర్శనలా కాకుండా, పరామర్శకు మాత్రమే జగన్‌కు అనుమతి ఇచ్చారన్నారు. ఇందుకు సంబంధించి బందోబస్తు కూడా ఏర్పాటు చేశారన్నారు. కానీ జగన్ మాత్రం పోలీసుల సూచనలను పట్టించుకోకుండా, పరామర్శ పేరుతో రాజకీయ కుట్రలతో జగన్ చేసిన షో కారణంగా ఇద్దరు వైసిపి కార్యకర్తల మృతికి కారణమయ్యారన్నారు. కారు కింద పడిన కార్యకర్త సింగయ్య చనిపోయినట్లు తెలిసినా జగన్ పట్టించుకోకుండా పర్యటనను కొనసాగించడం ఆయన క్రూరత్వానికి నిదర్శనమన్నారు. ప్రమాదంపై పశ్చాత్తాపం వ్యక్తం చేయకపోగా బుకాయిస్తూ, వైసిపి నాయకులు, సొంత మీడియా ద్వారా దిగజారు రాజకీయం చేయడం అసహ్యం పుట్టిస్తోందన్నారు. మాజీ సీఎం అయి ఉండి 'ఫర ఫర నరికేస్తాం..' అనే మాటలను సమర్థించడం సిగ్గుచేటన్నారు. తాడేపల్లి ప్యాలెస్ ముందు తాటికాయ పడితేనే భూ మండలం బద్దలైనట్లు నానాయాగీ చేసే జగన్ కార్యకర్త తల కారు కింద పడి నలిగిపోతే పట్టించుకోలేదంటే మనుషుల ప్రాణాలు అంటే ఎంత లెక్కలేనితనమో అర్థం అవుతుందన్నారు. ఇప్పటికైనా జగన్ తన తీరును మార్చుకోవాలని, లేనిపక్షంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు.

'కొగటం..నోరు అదుపులో పెట్టుకో..'

టిడిపి నాయకుల ఆగ్రహం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

డిప్యూటీ మేయర్ కొగటం విజయభాస్కర్‌రెడ్డి.. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని టిడిపి నాయకులు హెచ్చరించారు. మంగళవారం అనంతపురం అర్బన్ టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కార్పొరేషన్ల డైరెక్టర్లు, టిడిపి నాయకులు, తెలుగు మహిళలు మాట్లాడుతూ యువతపోరుకు జనం రాకపోవడంతో కొందరు అమాయకులకు మాయమాటలు చెప్పి తీసుకొచ్చి మంత్రి నారా లోకేష్ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. నారా లోకేష్‌ను విమర్శించే స్థాయి కొగటంకు లేదన్నారు. మంత్రి లోకేష్ రెడ్‌బుక్ ఓపెన్ చేస్తే వైసిపి నాయకులు రోడ్ల మీద తిరగలేరన్నారు. ప్రజలకు సంక్షేమాన్ని అందించే సూపర్ సిక్స్ పథకాలను ఎద్దేవా చేస్తున్నావంటే మిమ్మల్ని ఏమనాలన్నారు. జగన్‌కు జైలుకు వెళ్లడం కొత్త కాదంటున్న వైసిపి నాయకులు ఆయనేం స్వాతంత్ర్య సమరంలో జైలుకు వెళ్లలేదని, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటూ జైలు జీవితం గడిపారనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. జనం మీకు 11సీట్లు ఇచ్చినా ఇంకా బుద్ధి రాలేదన్నారు. మరోసారి లోకేష్ గురించి మాట్లాడితే తెలుగు మహిళలు దేహశుద్ధి చేసేందుకు కూడా వెనుకాడరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్లు పోతుల లక్ష్మీనరసింహులు, పరమేశ్వర్, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్, టిఎన్‌టియుసి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మోహన్‌కుమార్, తెలుగుమహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని, కార్పొరేటర్లు జనబలం బాబా, బాలాంజనేయులు, తెలుగు నాయకురాలు వడ్డే భవాని, టిడిపి నాయకులు వాల్మీకి ఫణీంద్ర, నూర్, వెంగమనాయుడు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశానికి సర్టిఫికెట్ల పరిశీలన

భారీగా వచ్చిన విద్యార్థులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

సర్టిఫికెట్లను తనిఖీ చేస్తున్న పాలిటెక్నిక్ అధికారులు

పాల్ టెక్నికల్‌లో సాంకేతిక విద్యను అభ్యశించడానికి విద్యార్థులు సరిఫికెట్ల వెరిఫికేషన్ల కోసం భారీగా తరలివస్తున్నారు. మండల పరిధిలోని బోరంపల్లి పాల్‌టెక్నిక్ కళాశాలలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న సర్టిఫికెట్ల పరిశీలన మంగళవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ డిప్లొమా ఇన్‌సివిల్ ఇంజినీరింగ్‌లో 66, ఇన్‌ఆర్టిఫిషియల్ ఇన్‌టలిజెన్సీ, మిషన్ లర్నింగ్‌లో 33, ఇన్‌ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో 66 సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఆయా సీట్లలో 2025-26 విద్యాసంవత్సరంలో చేరే విద్యార్థులకు అవకాశం ఉందన్నారు. ఇప్పటి వరకు 172 మంది విద్యార్థుల సరిఫికెట్లు పరిశీలించినట్లు తెలిపారు. బుధవారం చివరి రోజు అన్నారు. పాలిసెట్‌లో 68,001 నుంచి 86,000 ర్యాంకులు సాధించిన విద్యార్థుల సరిఫికెట్లను పరిశీలించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ హెచ్‌ఒడి షేక్ బాద్‌షా, వెరిఫికేషన్ ఆఫీసర్ దీపిక, ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ విద్య అవసరం

ప్రజాశక్తి-గుత్తి

కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డిఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తా

ప్రతి విద్యార్థికీ కంప్యూటర్ విద్యను అభ్యసించడం తప్పనిసరి అని గుంతకల్లు రైల్వే డివిజినల్ మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా సూచించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా గుత్తి డీజిల్ ఎలక్ట్రికల్ లోకో షెడ్‌లో పని చేస్తున్న వ్యాప్టెక్ కంపెనీ రూ.30 లక్షలతో పట్టణంలోని కోట ప్రాంతంలో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ ల్యాబ్‌ను విద్యార్థులు వినియోగించుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. అనంతరం గుత్తి కోట వద్ద ఉన్న సర్ థామస్ మన్రో సమాధిని సందర్శించి పుష్పగుచ్చాలు ఉంచి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గుత్తి సీనియర్ డిఎంఇ ప్రమోద్, వ్యాప్టెక్ కంపెనీ ప్రతినిధి రాజీవ్ కాంబోజీ, డివైడిఇఒ మల్లారెడ్డి, ఎంఇఒ బి.రవినాయక్, పాఠశాల హెచ్‌ఎం సుభాన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగకు విత్తనశుద్ధి తప్పనిసరి

అనంతపురం మండల ఏవో వెంకటకుమార్

ప్రజాశక్తి-అనంతపురం

సాగుపై అవగాహన కల్పిస్తున్న అనంతపురం మండల ఏవో వెంకటాకుమార్

వేరుశనగకు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని అనంతపురం మండల వ్యవసాయ అధికారి వెంకటకుమార్ పేర్కొన్నారు. మంగళవారం నాడు ఆలమూరు, కట్టకిందపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అలమూరు సర్పంచి సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి పాల్గొని రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. వేరుశనగలో విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలన్నారు. అవసరమైన విత్తన వేరుశనగ కాయలను రైతులకు అందించేందుకు సిద్ధంగా ఉంటామన్నారు. విత్తనాలు, ఎరువులు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి డి.ఉమాదేవి, సర్పంచ్ సూరి, వ్యవసాయ విస్తరణాధికారి బి.మురళీకృష్ణ, ఉద్యాన విస్తరణ అధికారి శ్రీనివాసులు, గ్రామ వ్యవసాయ సహాయకులు గీతా వాణి, గ్రామ పశు సంవర్ధక సహాయకులు రాజేంద్ర ప్రసాద్, టిడిపి నాయకులు భాస్కర్ నాయుడు, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే అస్మిత్

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

గ్రామాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండలం పరిధిలోని మదనపల్లి గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించి స్థానికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా గ్రామంలో కొన్ని కాలనీలకు తాగునీటి సమస్య, సీసీ రోడ్లు, డ్రెయినేజీ, పెన్షన్లు, తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్య అవసరాన్ని బట్టి ప్రతి సమస్యనూ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బాలాజీరాజు, ఎంపిడిఒ శకుంతలమ్మ, ఐసిడిసి సూపర్‌వైజర్ ఉమాదేవి, ఎపిఒ గంగరాజు, ఆర్‌బ్ల్యూఎస్ సి.లక్ష్మీనారాయణ, మండల ఇంజనీర్ ప్రసన్నకుమార్, ఎంఇఒ ఓబుళపతి, విద్యుత్ శాఖ ఎఇ నరసింహులు, టిడిపి సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, శశిధర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, లోకనాథ్‌రెడ్డి, పెద్దిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకట శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో జర్నలిస్టులను భాగస్వామ్యం చేయడమే లక్ష్యం

'జేశాప్' రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్

నూతన సభ్యులను సన్మానిస్తున్న జర్నలిస్టులు

ప్రజాశక్తి-అనంతపురం

జర్నలిస్టులను క్రీడల్లో భాగస్వామ్యం చేయాలన్నదే జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జేశాప్) లక్ష్యమని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం నగరంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో జిల్లా జేశాప్ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతపురం, సత్యసాయి జిల్లాల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షులుగా రేపటి రామాంజనేయులు, అనంతపురం జిల్లా అధ్యక్షులుగా కొనంకి రవితేజ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా శివప్రసాద్, కేశవనాయుడు, కోశాధికారిగా ఏళ్ల సాయికుమార్, కార్యదర్శులుగా కుళ్లాయప్ప, జాయింట్ సెక్రటరీ శివ, రవి, విజయ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గుత్తి నాగేంద్ర, ఈసీ మెంబర్లుగా సుధీర్, దాదు, కేశవ, ఉపేంద్ర, రవీంద్రను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఎరుకల బలోపేతానికి కృషి

రాష్ట్ర కార్యదర్శి కోలేగుండ్ల శేఖర్

నియామక పత్రాలను అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఉరవకొండ

ఎరుకుల కులస్తులను రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామని ఆంధ్రప్రదేశ్ ఎరుకల సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొలేగుండ్ల శేఖర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఎరుకుల సేవా సంఘం ఆధ్వర్యంలో ఉరవకొండలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉరవకొండ మండల అధ్యక్షులుగా వై.రాజు, ఉపాధ్యక్షులుగా అశోక్, ప్రధాన కార్యదర్శిగా వై.రవి, ఆర్గనేజేషన్ సెక్రటరీగా వై.రఘు, కార్యదర్శిగా ప్రసాద్, కార్యనిర్వహణ కార్యదర్శిగా వై.సత్తి, కార్యవర్గ సభ్యులుగా నెట్టికల్, వెంకటస్వామి, సలహాదారుడుగా గంగిరెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 78ఏళ్లు పూర్తయినా ఎరుకుల కులస్తులు అన్నిరంగాల్లో వెనుక పడటం బాధాకరమన్నారు. కావున అన్నిరంగాల్లో అభివృద్ధి చెందే వరకూ అందరం కలిసికట్టుగా పోరాడుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సెక్రటరీ మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి

వినతిపత్రం అందజేస్తున్న బీడీ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

పట్టణంలోని ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యా హక్కు చట్టాన్ని అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని బీడీ అండ్ ఫిగర్ యూనియన్ నాయకులు కోరారు. ఈమేరకు బీడీ కార్మికులతో కలిసి మండల విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్‌టిఇ చట్టం-2009 ప్రకారం సెక్షన్ 12 కింద ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో కార్మికుల పిల్లలకు 25 శాతం ఉచిత విద్యను అందించాలన్నారు. అయితే ఈ చట్టాన్ని ఎక్కడా అమలు చేయడం లేదన్నారు. కావున ఉన్నతాధికారులు స్పందించి విద్యాహక్కు చట్టాన్ని అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీడీ అండ్ సిగార్ యూనియన్ నాయకులు ఉమాగౌడ్, బీడీ కార్మికులు నూర్జాహాన్, నయమూన్, జిలాన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సౌకర్యమే టిడిపి ధ్యేయం

రోడ్డును చదును చేయిస్తున్న టిడిపి నాయకులు

ప్రజశక్తి-కణేకల్లు

ప్రజలు సౌకర్యమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని టిడిపి నాయకులు అన్నారు. కోతకు గురైన కణేకల్-మాల్యం గ్రామాల మధ్యలో ఉన్న రోడ్డుకు టిడిపి నాయకులు ఎర్రమట్టి వేసి చదును చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈరోడ్డు సంవత్సర కాలంలోనే 10సార్లు మరమ్మతులకు గురైనట్లు తెలిపారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ఎప్పటికప్పుడు సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ లాలెప్ప, ఆనంద్‌రాజ్, నీటి పారుదల సంఘం అధ్యక్షులు రమేష్, ఆదర్శ భారతి అధ్యక్షులు చంద్రశేఖర్ గుప్తా, మార్కెట్ యార్డు డైరెక్టర్ చాంద్‌బాషా, కురుబ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మూడునెలల్లో విద్యుత్ నూతన కనెక్షన్లు

ప్రజశక్తి-బొమ్మనహాల్

దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకూ మూడునెలల్లో నూతన విద్యుత్ సర్వీసులు మంజూరు చేరస్తామని విద్యుత్ శాఖ రాయదుర్గం డిఇ రాజశేఖర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రైతులందరూ సహకరిస్తే 24 గంటలు ప్రతి గ్రామంలో విద్యుత్ సరఫరాకు కొత్తలైన్లు వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎడి శ్రీనివాసులు, ఎఇ లక్ష్మారెడ్డి, విద్యుత్ సిబ్బంది అనీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి-బెలుగుప్ప

మండలంలోని కెజిబివి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపిపి సి.పెద్దన్న, టిడిపి జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ఎంఇఒ హరికృష్ణ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా భోజన నాణ్యతను పరిశీలించడంతోపాటు పాఠశాలలో సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దన్న, టిడిపి జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ఎంఇఒ హరికృష్ణ, ఎస్ఒ నాగరత్నబాయి, ఉపాధ్యాయురాలు ధనలక్ష్మి, ఫరీదా, సువర్ణ, భాగ్యమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌ను కలిసిన టిడిపి నేతలు

తహశీల్దార్‌కు బొకే అందజేస్తున్న టిడిపి నాయకులు

ప్రజశక్తి-బుక్కరాయసముద్రం

నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ శ్రీధర్‌బాబును మండలంలోని పసులూరు టిడిపి నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో రెవెన్యూ సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తహశీల్దార్‌ను కలిసిన వారిలో టిడిపి నాయకులు పిట్టు రామకృష్ణారెడ్డి, మాజీ వైస్ సర్పంచు మీనుగ పెద్దన్న (కట్లు) చింతమాను కుమార్, ఈరప్ప, వెంకటేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.

అంతర్ పంటలు సాగు చేయండి

జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే రైతులు కంది, ఆముదం పంటలను అంతర పంలుగా సాగు చేస్తే లాభదాయకంగా ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ సూచించారు. మంగళవారం పట్టణం పరిధిలోనిపై తోటలో సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మానాయక్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఉమామహేశ్వరమ్మ ఖరీఫ్ సీజన్‌లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వివిధ పంటలకు వ్యాపించే తెగుళ్లు, చీడపీడల యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ వేరుశనగను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అహ్మద్ బాషా, రైతు సేవా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నార్పల : మండల వ్యవసాయ చెన్న వీరాస్వామి ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి సంబంధించి బిందుసేద్య పరికరాలు రాయితీపై ఇస్తున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు రైతు సేవాకేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అనంతరం ఖరీఫ్, రబీ సీజన్లలో పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ, నారాయణస్వామి, గ్రామ వ్యవసాయ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు : మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో ఉన్న రైతుసేవా కేంద్రంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి కృష్ణచైతన్య రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఇఒలు సుజిత, రంజిత, విఎఎ గౌస్‌బాషా, ఎంపిఇఒ గంగరాజు, రైతులు పాల్గొన్నారు.

ఉరవకొండ : విత్తన శుద్ధితో రైతులు అధిక దిగుబడి సాధించవచ్చని విడపనకల్లు మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య సూచించారు. మంగళవారం విడపనకల్లు మండల పరిధిలోని కొత్తకోట, మాలాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో నిర్వహించారు. ఇందులో భాగంగా రైతులతో ఖరీఫ్ సీజన్‌లో ప్రధాన పంట వేరుశనగ పంటపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రైతు కేంద్ర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ మండల పరిధిలోని వెలిగొండ, బూదగవి గ్రామాల్లో అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ కార్యాలయం ఇండియా లిమిటెడ్ ప్రతినిధి శ్రీనివాస్‌తో కలిసి పర్యటించి రైతులకు బీమా, సాగు విధివిధానాలపై అవగాహన కల్పించారు. సాగు చేసే పంటలకు సంబంధించి ఇన్సూరెన్స్ ప్రీమియం వివిధ రకాల పంటలకు రైతులు చెల్లించాల్సిన విధివిధానాలు వివరించారు. అనంతరం బూదగవి గ్రామంలో రైతు సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించి రైతులకు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల ఏర్పాటుకు వినతి

కమిషనర్‌తో చర్చిస్తున్న గౌని ప్రతాపరెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని కణేకల్ రోడ్డు వద్ద ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆట మైదానం, బళ్లారి రోడ్డులోని వారపు సంత మైదానం వద్ద ప్రజలు రైతుల సౌకర్యార్థం మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని బిసివై పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, రాయదుర్గం రైతు రక్షణ వేదిక వ్యవస్థాపకులు గౌని ప్రతాపరెడ్డి కోరారు. ఈమేరకు మంగళవారం పట్టణంలోని కమిషనర్ ఛాంబర్‌లో కమిషనర్ దివాకర్‌రెడ్డిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆట మైదానంలో నిత్యం అనేకమంది ఆటగాళ్ల పాదచారులు, క్రీడాకారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు,పెన్షనర్లు, వివిధ వర్గాల ప్రజలు వాకింగ్ కోసం వస్తుంటారన్నారు. వీరందరూ మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కావున మైదానంలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. అలానే ప్రతి గురువారం బళ్లారి రోడ్డు వైఎస్ఆర్ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న రైతుల మార్కెట్ వారపు సంతకు ఎంతోదూరం నుంచి రైతన్నలు వస్తుంటారన్నారు. వారికి ఎలాంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. కావున ఇక్కడ కూడా మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు. ఇందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించి మున్సిపల్ ఆధ్వర్యంలో టాయిలెట్లను మరియు సులభ కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారన్నారు.

టెక్నికల్ పే స్కేల్‌ను వర్తింపజేయాలి

సచివాలయ ఉద్యోగుల జెఎసి అసోసియేషన్

అనంతపురంలో వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

ప్రజాశక్తి-అనంతపురం

సచివాలయ ఉద్యోగులకు టెక్నికల్ పేస్కేల్ అయలు చేయాలని సచివాలయ ఉద్యోగుల జెఎసి అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం అనంతపురంలోని పబ్లిక్ హెల్త్ సర్కిల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం పబ్లిక్ హెల్త్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజినీర్ సతీష్ చంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల జెఎసి నాయకులు హనుమంతు, రామాంజనేయులు, భగీరథరెడ్డి, ముఖేష్, నితిన్, సాయితేజ, చక్రవర్తి ఇర్ఫాన్ అలీఖాన్, మంజుల, మౌనిక, మౌలాలమ్మ దేవి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాకే బదిలీలు చేపట్టాలి

ఉరవకొండ : సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించిన తర్వాతనే బదిలీలు చేపట్టాలని సచివాలయ ఉరవకొండ జెఎసి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం జెఎసి ఆధ్వర్యంలో ఎంపిడిఒ రవిప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల స్థాయి లేదా ఆపై అధికారుల బదిలీల నియమ నిబంధనలతో సంబంధం ఉన్న జీవో నెంబర్ 5 నుండి సచివాలయ ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలన్నారు. వీటితోపాటు అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించిన తర్వాతనే బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ జెఎసి నాయకులు అహమ్మద్, నూర్, ఉట్టి హర్షవర్ధన్, షబానా, నాగమ్మ, హనుమంతురెడ్డి, ఆశీర్‌బాబు, షఫీ, తదితరులు పాల్గొన్నారు.

నార్పల, బి.పప్పూరు వెటర్నరీ వైద్యులుగా సాయిసుప్రజ, శ్వేత

డాక్టర్ సుప్రజ

డాక్టర్ స్వేత

ప్రజాశక్తి-నార్పల

మండలంలోని నా **ప్రజాశక్తి-**ర్పల, బి.పప్పురు పశు వైద్యశాలల వెటర్నరీ డాక్టర్లుగా సాయిసుప్రజ, బి.శ్వేత మంగళవారం బాధ్యతలు చేపట్టారు. పామిడి మండలం ఎద్దులపల్లి డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సాయి సుప్రజ నార్పలకు, చియ్యేడు డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్వేత బి.పప్పూరుకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ వైద్యశాలలో రైతులకు అందుబాటులో ఉంటూ మండలవ్యాప్తంగా వైద్యసేవలు అందజేస్తామని తెలిపారు.

బదిలీ డాక్టర్‌కు సన్మానం

మండల కేంద్రంలోని పశువైద్యశాలలో బదిలీపై వెళ్తున్న డాక్టర్ గోవిందరాజులును నార్పలకు నూతనంగా వచ్చిన వెటర్నరీ డాక్టర్ సాయి సుప్రజా, వైద్య సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిడిఇఒ బిఎల్‌డిఎ డాక్టర్ సుధాకర్, ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి, బుక్కరాయసముద్రం ఎడి రత్నకుమార్, డాక్టర్ శ్వేత, మండల విద్యాధికారి కృష్ణయ్య, మండల వ్యవసాయ అధికారి చెన్నవీరస్వామి, ఆల్ ఇండియా రేడియో కోఆర్డినేటర్ హేమంతరాజు, మండల రైతులు, ఎహెచ్ఎలు, గోపాలమిత్రలు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ డాక్టర్‌ను సన్మానిస్తున్న వెటర్నరీ సిబ్బంది

రోటరీ ఉన్నత పాఠశాల నూతన కార్యవర్గం ఎంపిక

కార్యక్రమంలో మాట్లాడుతున్న అతిథులు

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని రోటరీ ఉన్నత పాఠశాలలో అడ్వైజరీ కమిటీ సభ్యులు రొటీరియన్లు జీవీ లక్ష్మణ్, లక్ష్మీనారాయణ గుప్తా ఆధ్వర్యంలో ఛైర్మన్‌గా బి.శిరీష్‌కుమార్, కరస్పాండెంట్‌గా ఉమా వక్కల, వైస్‌ఛైర్మన్‌గా డి.మాధవీలత, కార్యదర్శిగా జి.శ్రీనివాసులు, సహాయ కార్యదర్శిగా జి.ఎన్.వరలక్ష్మి, కోశాధికారిగా పి.సత్యనారాయణతోపాటు మరో ఆరుగురిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతన ఛైర్మన్, కరస్పాండెంట్ మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థులకు సమాజ స్పృహ, నైతిక విలువలతో కూడిన విద్యా విధానాన్ని, మానవీయ విలువలు నేర్పిస్తామన్నారు. విద్యార్థుల విద్యా అభివృద్ధికి కట్టుబడి ఉంటామని తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ రోటీరియన్లు పాల్గొన్నారు.

మొక్కలు నాటాలని వినతి

యాడికి : మండలంలోని రాయలచెరువు దైవాలమడుగు వరకూ నూతన రహదారికి ఇరువైపులా మొక్కలు నాటాలని రాయలచెరువు లయన్స్ క్లబ్ సభ్యులు కోరారు. ఈమేరకు మంగళవారం స్థానిక కార్యాలయంలో ఎపిఒ మదిలేటికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించడం, వాతావరణ కాలుష్యం తగ్గించడం, గ్రామీణ ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ సూర్యనారాయణ, జోన్ ఛైర్మన్ రవికుమార్‌రెడ్డి, ప్రసాద్, శేషానందరెడ్డి, ఇస్మాయిల్, మురళీ, సత్యనారాయణ, అల్లాబకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి పశువైద్యాధికారిగా మంజునాథ్

బెలుగుప్ప : ఇన్‌ఛార్జి పశు వైద్య డాక్టర్‌గా బి.మంజునాథ్ మంగళవారం మండల కేంద్రంలోని పశు వైద్యకేంద్రంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు పశువైద్య సిబ్బంది శాలువాలు కప్పి సన్మానించారు. కాగా ఇక్కడ పని చేస్తూ బదిలీపై వెళ్తున్న పశువైద్యాధికారి రమేష్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బెలుగుప్ప గొర్రెల కాపరులు బోయ రాజప్ప, కంచరాముడు, దేవేంద్ర, వంశీ, పాడి రైతు ఎర్రగుడి శివరామకృష్ణ, పశు వైద్య సిబ్బంది, రైతులు, గొర్రెల కాపరులు, తదితరులు పాల్గొన్నారు.

'ఆశా' పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

యల్లనూరు : మండల కేంద్రంలోని సచివాలయం-2లో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్త పోస్టు భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని స్థానిక వైద్యాధికారి లోకేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30వతేదీలోపు అర్హులైన అభ్యర్థులు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తు ఫారాలను అందజేయాలని కోరారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ : డిఎంహెచ్ఒ

మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ ఇబి దేవి

అనంతపురం : జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న వైద్య సిబ్బంది గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని డిఎంహెచ్ఒ ఇబి దేవి సూచించారు. మంగళవారం ఇంటిగ్రేటెడ్ హైరిస్క్ ప్రెగ్నెన్సీ మేనేజ్‌మెంట్ ప్రొటోకాల్స్‌పై శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా వైద్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కామేశ్వర ప్రసాద్ హైరిస్క్ ప్రెగ్నెన్సీలు ఎలా నివారించాలనే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ పి.యుగంధర్, అనుపమ జేమ్స్, శ్రీనివాస్‌రెడ్డి, విష్ణుమూర్తి, సిబ్బంది డిఎస్‌వి రాజు, జిల్లా మేనేజర్ వ్యాక్సిన్స్ స్టోర్, శామ్యూల్, ఎస్తేర్ రాణి, ప్రమీల, సి.సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్‌కు పరికరాల వితరణ

ప్రెస్‌క్లబ్‌కు వస్తువులను అందజేస్తున్న డాక్టర్ వెంకట అనిల్‌ప్రసాద్‌రెడ్డి

అనంతపురం సిటీ : నగరంలోని ప్రెస్‌క్లబ్‌కు రాయలసీమ ప్రాంతంలో సుపరిచితుడైన డాక్టర్ చామల వెంకట అనిల్‌ప్రసాద్‌రెడ్డి రూ.16వేలు విలువజేసే ఎలక్ట్రానిక్ పరికరాలను వితరణ చేశారు. ఈమేరకు ఆయా పరికరాలను మంగళవారం ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ఆజాద్, సెక్రటరీ భాస్కర్‌రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ట్రెజరర్ వీరశేఖర్‌రెడ్డి, సీనియర్ పాత్రికేయులు జంబుల రమేష్‌రెడ్డి, కుంచెపు భాస్కర్, యనుముల కుల్లాయప్ప, సి.హరికృష్ణ, మల్లికార్జున, భీమరాజు, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

యువతను మోసం చేసిన కూటమి ప్రభుత్వం

ఉరవకొండ : తాము అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయినా అమలు చేయకుండా మోసం చేసిందని ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కావలి కొట్రేష్ విమర్శిమచారు. ఈమేరకు ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉరవకొండలో కూటమి ప్రభుత్వం మోసాలపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం నిరుద్యోగుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు నవీన్ కుమార్, అంజి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

మాట్లాడుతున్న సిఐ రామసుబ్బయ్య

గుత్తి : ప్రతి విద్యార్థి సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పెద్దవడుగూరు సీఐ రామసుబ్బయ్య సూచించారు. మంగళవారం గేట్స్ పాలిటెక్నిక్ కళాశాలలో ఇన్స్పిరేషనల్ టాక్ సిరీస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్య విద్యార్థులకు ఎన్నో అవకాశాలను అందిస్తుందన్నారు. క్రమశిక్షణతో చదివి లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ర్యాగింగ్, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. వాటి వల్ల విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గేట్స్ పాలిటెక్నిక్ కళాశాల కరస్పాండెంట్ వికె పద్మావతమ్మ, ప్రిన్సిపాల్ సుధాకర్, ప్రొఫెసర్ రామచంద్రయ్య, ఎఓ ఇంతియాజ్‌బాషా, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

యాడికి టిడిపి మండల పరిశీలకునిగా 'డేగల'

శింగనమల : తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల యాడికి మండల పరిశీలకునిగా జిల్లా అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి నియమితులయ్యారు. తన నియామకానికి సహకరించిన సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి డేగల కృష్ణమూర్తి కృతజ్ఞతలు తెలిపారు. సంస్థాగత ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

ఐఎన్‌టిఎస్ఒ విజేతలకు బహుమతులు ప్రదానం

బహుమతులు అందజేస్తున్న ఎజిఎం సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం శ్రీ చైతన్య ఎటిపి-8 పాఠశాలకు సంబంధించి ఐఎన్‌టిఎస్ఒ విజేతలకు మంగళవారం ఆ పాఠశాలలో బహుమతులు ప్రదానం చేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎజిఎం సుబ్బారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నేత్రావతి, ప్రాథమిక విభాగం డీన్ సుప్రజ, ప్రైమరీ కోఆర్డినేటర్ పూజ, ప్రాథమిక విభాగం ఇన్‌ఛార్జి దేవకృప, అర్షియా, విద్యార్థులు పాల్గొన్నారు.

గూగూడులో చక్కెర వేలంపాట

నార్పల : మండల పరిధిలోని గూగూడు కుళ్లాయిస్వామి ఆలయ ఆవరణలో భక్తులు సమర్పించిన చక్కెర కొనుగోలుకు మంగళవారం వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా కిలో చక్కెర రూ.36తో 4,554కిలోల చక్కెరను వేలం వేయగా ఆలయానికి రూ.1,63,944 ఆదాయం వచ్చినట్లు ఆలయకారి నిర్వహణ అధికారి సాకేతపురం శోభ తెలిపారు.

ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర ఉపాధ్యక్షునికి అభినందనలు

మాధవ్‌ను అభినందిస్తున్న సహచరులు

కళ్యాణదుర్గం టౌన్ : పట్టణానికి చెందిన ఎపిఎన్‌జిఒ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాధవ్‌కు పలువురు ఉద్యోగులు అభినందనలు తెలిపారు. ఈయన ముద్దినాయనపల్లి పిఎస్‌సి నుంచి జిల్లాకేంద్రంలోని పోలీస్ ట్రైనింగ్ కళాశాల యునిట్‌కు బదిలీ అయ్యారు. ఈనేపథ్యంలో మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టగా సహచర ఉద్యోగులు అభినందించారు. కళ్యాణదుర్గం ఎన్‌జీఓ కార్యాలయంలో సంఘం తాలుకా అధ్యక్షుడు చెన్నారెడ్డి, అసోషియేట్ ప్రసిడెంట్ ఫజల్‌మహమ్మద్, ఉపాధ్యక్షుడు గంగరాజు, మహిళా ఉద్యోగులు సుజాత, అచ్చమ్మ, అనంత లక్ష్మి, తదితరులు సమావేశమై అభినందనలు తెలిపారు.

నేరాలు ఘోరాలు

వివాహిత ఆత్మహత్య

చిట్టెమ్మ (పాతచిత్రం)

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని పాల వెంకటాపురం పైదొడ్డి గ్రామానికి చెందిన గొల్ల గోవిందు భార్య గొల్ల చిట్టెమ్మ (28) మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పాల వెంకటాపురం పైదొడ్డి గ్రామానికి చెందిన గోవిందుకు ఇద్దరు భార్యలు. మొదటి భార్యకు ఆరెకరాల పొలాన్ని రాసిచ్చాడు. అయితే చిన్న భార్య చిట్టెమ్మకు ఆస్తిలో భాగాలు ఇవ్వక నానా ఇబ్బందులకు గురి చేస్తుండేవాడు. ఈనేపథ్యంలో మనస్థాపం చెందిన చిట్టెమ్మ సోమవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. చిట్టెమ్మకు భర్తతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో చోరీ

గుత్తి : మండలంలోని మాముడూరు గ్రామ సమీపంలో ఉన్న రామదొడ్డి ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ నిర్వాహకులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఆలయం తలుపు బద్దలు కొట్టి గుర్తు తెలియని దుండగులు లోనికి చొరబడ్డారు. ఆలయ ఆవరణలో ఉన్న హూండీని పగల కొట్టి అందులో ఉన్న రూ.5 నగదును దోచుకు వెళ్లారు. ఘటనపై ఆలయ నిర్వహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.